# 'అమ్మా' అంటే ఏమిటి మమ్మీ ?

## 14 మార్చి శుక్రవారం :

ఈ రోజు స్కూల్ డే జరిగింది నేను పన్నెండు ప్రైజులు ఒక్కొక్కటీ వరుసగా అందుకుంటుంటే చీఫ్‌గెస్ట్ ... ఇవన్నీ నీకే నేమో... ఒకేసారి తీసుకెళ్ళు బాబూ... అని నవ్వుతూ అంటే ఎంత గర్వపడ్డాను. అంత పెద్ద హైస్కూల్ అయినా ఫోర్తుక్లాస్ చదువుతున్న నాకే మెరిట్ అవార్డు రావడం... అది తీసుకునేటప్పుడు ఎన్ని చప్పట్లు విన్పించాయి.

మమ్మీ డాడీ కూడా ఈ ఫంక్షన్‌కి వస్తే బావుండు. వాళ్లెప్పుడూ ఇంతే. డాడీకి క్లబ్బులు, మమ్మీకి మీటింగ్‌లు. ఇంటికెళ్ళి ప్రైజులు చూపించినా పట్టించుకోలేదు. వాటిని చూసుకుంటూ ఎంత ఏడ్చాను ?

హు... వీళ్ళు మమ్మీ డాడీలా... ? కానేకాదు.

## 2 ఏప్రిల్ బుధవారం :

ఈ రోజు నా బర్త్‌డే... కానీ నా చిన్న ఫ్రెండ్స్‌ని వీళ్లు పట్టించుకోలేదు. వాళ్ళేమనుకున్నారో... మమ్మీ మహిళాసంఘాల వాళ్లని పిలిపించుకొని నెక్లెస్‌లు చూపించుకోవడంలోనే గడిపింది. డాడీ నేను కేక్ కట్ చేయకముందే ఫ్రెండ్స్‌తో తాగారు.

డాడి తూలి క్రొవ్వొత్తుల మీద పడితే మమ్మీ పెద్ద రభస చేసింది. వచ్చిన వాళ్లంతా ఏమనుకున్నారో ? ఇద్దరూ పెద్దగా పోట్లాడుకున్నారు. డాడీ తాగిన మైకంలో బూతులు తిడితే మమ్మీ పై ఫ్లోర్‌లోకెళ్లి తలుపేసుకుంది. డాడీ ఫియట్‌కారులో వెళ్లిపోయారు.

తోటమాలి రంగన్న కేకు తినిపిస్తే మంగమ్మ ఒక్కర్తే చప్పట్లు కొట్టింది. మమ్మీ డాడీలు నన్ను పట్టించుకోవడం లేదేమోననిపిస్తుంది.

## 21 మే సోమవారం :

తోటమాలి రంగన్న కూతురు లక్ష్మితో ఆడుకుంటే మమ్మీ ఎందుకు కొట్టిందో... లక్ష్మికి తను తెచ్చే ఆటబొమ్మలంటే ప్రాణం. బాదం చెట్టుకింద ఆడుకుంటుంటే ఈ ముష్టిదాంతోనా నువ్వాడేది ? దీపక్ రాజన్ వాళ్లింటికి వెళ్లి ఆడమని కార్లో పంపింది. వాళ్లింట్లో రాహుల్ ఆటబొమ్మల్తో ఆడుకోడు. మైఖెల్‌జాక్సన్ పాటలంటూ పిచ్చిపట్టినట్లు బ్రేక్ డాన్సులు చేస్తాడు. తనని చెయ్యమని బలవంతం చేస్తాడు. తను చెయ్యనంటే వాళ్ల అల్సేషన్ డాగ్‌ని ఉసిగొల్పి బెదిరిస్తాడు.

వాడుత్త ఈడియట్...

వాడితో ఆడుకోనని చెప్పినా మమ్మీ డాడి పట్టించుకోరు. వీళ్లింతే... రంగన్న, లక్ష్మి, మంగమ్మ వీళ్లే మంచివాళ్లు.

## 9 జూన్ గురువారం :

డాడీ క్యాంపుకెళ్లాక దీపక్ రాజన్ (రాహుల్‌గాడి డాడీ) రోజూ వస్తున్నాడు. మమ్మీతో వెకిలిగా ప్రవర్తిస్తున్నా... మమ్మీ ఏమనదేం ? పైగా నవ్వుతుంది.

డాడీకి తెలిస్తే... ?

పోనీ డాడీ క్యాంపు నుంచి రాగానే చెప్పేస్తాను.

వద్దు... మమ్మీ వీపు చీరేస్తుంది.

## 14 జూన్ మంగళవారం :

డాడీ ఈ రోజు కూడా రాలేదు.

దీపక్‌రాజన్ ఈ రోజంతా ఇంట్లోనే ఉన్నాడు. మమ్మీ గదిలో తలుపులేసుకొని వీడియో చూశారు. అదేం క్యాసెట్టో... తన రూంలోకి అంతా మ్యూజిక్ వినపడుతోంది. పెద్దగా మూలుగులు... అరుపులు.

కథా నిలయం 1068 శ్రీకాకుళం

క్రైం పిక్చరేమో ... ?

కాదు రాహుల్‌గాడు ఓసారి చెప్పాడు. బ్లూ ఫిలిం చూశావా అని! అంటే ఏమిటి??? ??? క్రయిం పిక్చర్లంటే నాకెంత భయమని...

## 17 జూన్ శుక్రవారం :

డాడీ లాంగ్ టూర్‌లో పోయినట్టున్నాడు.

ఈ రోజు తన స్కూల్ కెళ్ళే టైమైనా మమ్మీ తన గదిలోంచి లేవలేదు. మమ్మీ నేను స్కూల్ కెళ్తున్నాను అని మమ్మీ గది తలుపుబాదితే మంగమ్మ వద్దు బాబూ, నువ్వా గదివైపు వెళ్లకు అని డైనింగ్ టేబుల్ దగ్గరికి లాక్కెళ్లింది.

మిగతా మమ్మీ డాడీలందరూ తన ఫ్రెండ్స్‌ని బైక్‌లమీద స్కూల్ దగ్గర దించి కిస్ తీసుకుని వెళ్తారు. కార్లో నేనొక్కడ్నే. ఎప్పుడూ రంగన్న వెంట వస్తాడు ?

మంగమ్మ లాక్కెళ్లుతున్నప్పుడు మమ్మీ గది తలుపు సందులోంచి కన్పించింది.

ఛీ... ఎంత అసహ్యకరంగా... మమ్మీ ప్రక్కలో దీపక్‌రాజన్. ఈ రోజు స్కూల్లో ఏదీ అర్థం కాలేదు. మమ్మీ అంటే...

ఈజిప్షియన్‌ల భాషలో భద్రపరచబడిన శవం అన్నదే నిజం.

## 29 జూన్ మంగళవారం :

ఈ రోజు స్కూల్ నుంచి వచ్చేసరికి డాడీ మమ్మీని కొడుతున్నాడు. మమ్మీ కూడా డాడీ మీద తిరగబడింది. డాడీ కోటును చింపింది. గోళ్ళతో రక్కింది.

మమ్మీ తాగినట్టుంది. భళ్లున వాంతి చేసుకుంది. నా స్కూల్ బేగ్ పడేసి నేనేడుస్తూ నిల్చున్నా... నన్ను పట్టించుకోలేదు. డాడీ నోటినుంచి దీపక్‌రాజన్ పేరు విన్పిస్తోంది. ఇంగ్లీష్‌లో తిట్టితిట్టి కారు తీసుకొని వెళ్ళిపోయాడు.

మమ్మీ మళ్ళీతాగి గదిలోదూరి తలుపేసుకుంది. వాళ్ళిద్దరూ పురుగుల్లా కన్పించారు. ఈ రోజు రిజల్ట్స్ తెల్సి స్కూల్ ఫస్టొచ్చానని సంతోషంగా చెబ్దామని వస్తే వాళ్లు నన్ను పట్టించుకోరు.

## జులై 5 సోమవారం :

డాడీ ఈ రోజు దాకా రాలేదు.

మమ్మీ కూడా ఎప్పుడో రాత్రిళ్లు వస్తోంది. నిన్న రాత్రి పదకొండు తర్వాత దీపక్‌రాజన్ దించి వెళ్లాడు. మమ్మీ తూలుతూ ఏదో మాట్లాడుతుంటే అతడు దించి వెళ్లాడు.

**2 ఆగస్టు శనివారం :**

ఈ రోజు స్కూల్ యూనిట్లో సోషల్ స్టడీస్‌లో తక్కువ మార్కులొచ్చాయి. చాలా బాధేసింది ! మార్కులు తక్కువొచ్చాయని. నిన్న రాహుల్‌గాడు వెక్కిరిస్తే ఏడుపొచ్చింది. నాకెందుకో ఇంట్లో చదువుకోవాలని పించదు. పోనీ అంకుల్ ఇంట్లోకెళ్ళి చదువుకుంటానంటే మమ్మీ వెళ్ళనివ్వదు.

డాడీ మామూలుగానే తిరుగుతున్నాడు. మమ్మీ డాడీ ఎక్కువ మాట్లాడుకోవడం లేదు.

**18 ఆగస్టు ఆదివారం :**

నిన్న రాత్రి డాడీ లేరు. మమ్మీ గదిలోంచి మాటలు విన్పిస్తే చెవులు రిక్కించి విన్నాను. దీపక్‌రాజన్ కూడా ఉన్నాడు.

28వ తేదీ నాటికల్లా పథకం ప్రకారం జరిగిపోవాలి మమ్మీ అంటోంది.

ఇండస్ట్రియల్ ఎస్టేట్స్, కాంప్లెక్సులు ఈ లోగా మచ్చికతోనే నీ పేర రాయించుకో దీపక్‌రాజన్ మాట అది.

పకడ్బందీగా జరగాలి... లేకపోతే ఇది మనకే ముప్పు

ఖచ్చితంగా జరుగుతుంది డియర్. ఈ రాజన్‌గాడికి కింగ్‌కిల్లర్స్ చాలా మంది తెల్సు. నువ్వే చూస్తావ్‌గా ఆ తర్వాత వీడియో శబ్దాలే విన్పించాయి.

మమ్మీ ఏం ప్లాన్ వేసుకుంటోంది ? 28వ తేదీన తెలుస్తుంది కదా నా చదువు చాలా డిస్టర్బ్ అవుతోంది వీళ్ళతో.

**24 ఆగస్టు శనివారం :**

ఈ మధ్య మమ్మీ డాడీతో సంతోషంగా ఉంటోంది. కల్సి తింటున్నారు. డాడీ ఈ రోజు జోన్‌థామస్ అంకుల్‌తో కేరళ వెళ్తావా అనడిగారు. మమ్మీ ఏమో కరీంనగర్ వెళ్లరా ! మూర్తి అంకుల్ దగ్గరికి అంది. అక్కడైతే విజ్జి, ప్రదీప్, ప్రశాంతి, మాధురిలతో ఎంచక్కా ఆడుకోవచ్చు సువర్ణ అంటీ రమ్మని రాసింది కూడా.

కానీ... యూనిట్స్ దగ్గరపడితే వీళ్ళు ఊరుకెళ్లమంటారేమిటి ? మార్కులు

తక్కువొస్తే మళ్ళీ రాహుల్‌గాడు నవ్వడూ... ? వెళ్లనుగాక వెళ్ళను.

**29 ఆగస్టు గురువారం :**

28 రాత్రంతా మెలకువతోనే ఉన్నాను. మమ్మీ గదిలోంచి ఏమీ చప్పుడు వినపడట్లేదు. తెల్లారుతుండగా నిద్రపోయాను. మంగమ్మ ఏడుస్తూ తట్టిలేపింది.

తొమ్మిదవుతుందేమో...

నిద్రమత్తుతో కళ్ళు తుడుచుకోగానే. బాబూ... మమ్మీ చచ్చిపోయింది. చంపేసారెవరో అని ఏడుస్తోంది. కంగారుగా గదివైపు పరిగెత్తాను. రక్తపు మడుగులో మమ్మీ. అప్పటికే కొన్ని వందలకార్లు ఇంటి ముందుకొచ్చాయి.

ఏడ్పులు...అరుపులు... కాని నాకు ఏడుపురాలేదు. డాడీ ఓ మూలగా ఏడుస్తున్నారు. మా స్కూల్ టీచర్స్ కూడా వచ్చారు. యింకా ఎవరో వస్తున్నారు.

**4 సెప్టెంబర్ మంగళవారం :**

మమ్మీ చచ్చిపోయాక ఇల్లంతా ఎలాగో అయింది. ఈ సైలెన్స్ భయంకరంగా ఉంది. నేను స్కూల్ కెళ్ళడం లేదు.

నాలో ఎన్నో ప్రశ్నలు... ? ? ? మమ్మీ ప్లానేదో సక్సెస్ కాలేదా ? క్రమంగా దీపక్‌రాజన్ మమ్మీని చంపేసాడేమోననిపిస్తుంది.

రోజూ రాత్రి మంగమ్మ నా పక్కలో పడుకుంటోంది. డాడీ సరిగా ఇంటికి రావడం లేదు.

**15 సెప్టెంబర్ శనివారం :**

మమ్మీ జ్ఞాపకాలు కొద్దిగా తొలిగిపోతున్నాయి. ఈ రోజు మధ్యాహ్నం డాడీ ఎవర్నో వెంట పెట్టుకొచ్చాడు. ఆవిడ అందంగా ఉంది. మోడ్రన్‌గా అలంకరించుకుంది. ఇంట్లోకి వస్తూనే మమ్మీ ఫోటోని చూసి...

దీని ఫోటో ఇంకా ఎందుకుంచావ్ డియర్... మన ప్లాన్ గొప్పగా సక్సెసయింది కదా అంది. వాళ్ల ప్లానేమిటో నాకర్థం కాలేదు. డాడీ నన్ను పిలిచి, బాబూ... ఇప్పట్నించీ ఈమే నీకు మమ్మీ... ఏదీ మమ్మీనోసారి ప్రేమగా మమ్మీ అని పిలువ్ అన్నాడు.

నేనుపిలవలేదు.

పిలవమంటుంటే డాడీ హుంకరించాడు.

నాకు పిలవాలన్పించలేదు. ఛీ అన్నాను. ఆమె చెళ్ళున చెంప పగలగొట్టింది. డాడీమీద అసహ్యమేసింది.

ఈ రాత్రంతా మంగమ్మ పక్కలో భయంగా ఏడుస్తూనే పడుకున్నాను.

**శనివారం రాత్రి - ఆఖరు పేజీ :**

నాకిక్కడ భయం వేస్తోంది. మీ వూరికి పారిపోదాం మంగమ్మా అన్నాను బెంగతో

పోదాం కన్నా... ఈ ఆడంబరమయిన మనుషుల మధ్య నువ్వు పెరిగితే రాక్షసుడి వవుతావ్. వీళ్ళందరికీ దూరంగా నిష్కల్మషంగా నిన్ను పెంచుతాను. నేను దిక్కులేని దాన్ని కాను. పోతూపోతూ మనం... నువ్వురాసిన డైరీల్ని పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి వెళ్దాం... ఇకనుంచీ నన్ను అమ్మా అని పిలువ్‌బాబూ అని గుండెలకు హత్తుకుంది.

ఎటో ఎగిరిపోతామన్న సంతోషంతో అలాగేనని అమ్మని కరుచుకొని ప్రశాంతంగా నిద్రబోయాను. అమ్మ చాలా మంచిది. అమ్మా అంటే ఏమిటో మంగమ్మని ఊరెళ్లాక అడగాలి.